# ఏరోజైతే ఏం?

ఇంకా సాంతం తెల్లవారకపోతే ఏం? గడిచిన రాత్రి తొమ్మిది గంటలదాకా మెరీనా బీచిలో జరిగిన రాజకీయ రణరంగం – సమావేశం తాలూకు రిపోర్టు మధ్య రాత్రి దాటిందాకా వ్రాసి ముగించి, సంతృప్తిగా నిద్రపోతున్న ప్రత్యేక విలేఖరి ప్రభాకరం ఇంకో గంటో, గంటన్నరో నిద్రపోతే ఎవరానందిస్తారు! టపటపటప మెషీను గన్నులు పేలి, హాహాకారాలతో చీకటి చెక్కలు ముక్కలై, విసిరివేసినట్టు వచ్చి చెవిలోకి సూటిగా కొట్టుకునే సరకి, లోతుగా నిద్రలో ఉన్న ప్రభాకరం నిదర్లో ఉన్నవాడు నిద్రలో ఉన్నట్టే మంచం మీద ఎగిరి లేచి కూర్చున్నాడు.

ఏమి టా పేలుళ్ల పెటపెటలని విషయం అవగాహన చేసుకుంటున్న ప్రభాకరం – నడుస్తున్న లోకం ధోరణి, తీరు ఒంటబట్టినవాడు గనక – ఇట్టే చప్పున గ్రహించాడు. తన భార్య దుర్గా, చీకటితో వచ్చే పాలవాడూ వీధి కాంపౌండు గేటు వద్ద కుక్కలు పోట్లాడుకుంటున్నట్టు పోట్లాడుకుంటున్నారని, తెల్లవారడం మొదలైందని తట్టింది ప్రభాకరానికి.

"నీ పాలు మండినట్టే ఉన్నాయి" అంటున్నది దుర్గ, సగం అరవ తెలుగులో.

"చిక్కటి పాలు చీకట్లో తెలుస్తయా, తెల్లారి చూసుకో" అంటున్నాడు పాలవాడు సగం తెలుగు అరవంలో.

"నీ మొహం మండా! ఏ రోజు చీకట్లో పోస్తున్న పాలు తెల్లవారగానే నీళ్లు కుమ్మరించుకుని ఉండటం లేదూ? వద్దంటున్నా ఈ ముదనష్టపు ముగ్గు మాసిన పాలకే రెండున్నర వీడి మొహాన పారేస్తున్నా డాయన!" అంటున్నది దుర్గ, సరళంగా.

"ఇంకా నయం, ఈ మాత్రం పాలన్నా మీకు దక్కుతున్నాయి! లోకమంతా ధరలు పెరిగినాయి! పెరుగుతున్న ధరల్నే మా బర్రెగొడ్లు తింటున్నాయి! ఇదిగోనండోయ్, రేపట్నుంచి పాల ధర పడి మూడు రూపాయలు" అంటున్నాడు పాలవాడు.

"ఏమిటి?! మొహం మండ! మీ పాల వాళ్లు నెలనెలా మమ్మల్ని కాల్చుకు తింటున్నారు! నే నీ ముగ్గు మాసిన పట్నం వచ్చినప్పుడు పడి అర్ధ రూపాయి ఉండేది! అయ్యో, అయ్యో, ఎంత పొయ్యే కాలం వచ్చింది! మూడు రూపాయలు చేస్తావుట్రా పడి?

చెయ్. నన్ను ముక్కలుగా కోసినా ఇంక నీ దగ్గర పాలు పోయించుకుంటే నీ ఎడం కాలు జోడు తీసుక్కొట్టు!" అనేసింది దుర్గ.

"మానెయ్యండి. రేపు లెక్క చూసి మాది మాకు పారెయ్యండి" అనేశాడు పాలవాడు.

"చావు! నీలాంటి పాలవాళ్లు నా తలవెంట్రుక లంతమందున్నారని తెలుసుకో. నీ బాబులాంటి వాడి దగ్గర పోయించుకుంటాం". ఇంకా అంటున్నది దుర్గ.

"ఆఁ ఉన్నారు వెంట్రుక లంతమంది! పోయించుకో మూడుంకాలు రూపాయికి!" అన్నాడు పాలవాడు గుండు పేల్చినట్టు.

"పొయ్యేకాలం రాను! వీళ్ళ గుంపంతా ఒకటే! ముఠా కట్టి చస్తున్నారు! వీడా పేలడం అందుకే! పాల్లేకుండా మాడనన్నా మాడతాం గాని, నన్ను ముక్కలు కోసినా ఇంక నీ దగ్గర పాలు పోయించుకోను, చూస్తావుగా?" అని మెషీను గన్ను పేల్చింది దుర్గ.

"లచ్చుల మందిని చూశా నా పుటకల్నుంచి! మా పాలు తాగటం మానిన మడుసుల్ని నే నెరగను! రేపు తెల్లారి దుడ్డు లెక్కగట్టి ఇవ్వండి" అనేసి రేకు, గేటు ఠపీమని కొట్టి వెళ్లాడు పాలవాడు.

కాసేపు నిశ్శబ్దం, దుర్గ ఇంకా గేటు దగ్గరే దిమ్మెరపోయి నించునుందా! 'టాప్ టాప్' మన్నాయి వరండా, వంటింటి తలుపులు. దుర్గ వంటింట్లోకి చేరిందనుకున్నాడు ప్రభాకరం, నిటారుగా లేచి నించుంటూ.

"వచ్చారూ కాఫీకి? రండి, రండి! సిద్ధం చేసి రెడీగా ఉంచుతున్నా. రేపట్నుంచి మీరూ, మీ సుపుత్రుడూ, మీ సుపుత్రికా వంటింట్లో కొచ్చి నన్ను కాఫీ అడక్కండి - ఇప్పుడే చెబుతున్నా!" అని ప్రభాత గీతంతో చేర్చి మళ్లీ మెషీను గన్ను పేల్చింది దుర్గ.

"మరి నీ సంగతేమి"టని అడిగాడు ప్రభాకరం, నెమ్మదిగా వంటింట్లో కొచ్చి గోడకు చేరగిలపడుతూ.

"మీరు నన్ను కోసి ముక్కలు చేసినా సరే, కాఫీ మానడం నా వల్ల కాదు! అసలు మా ఇంట్లో నేను పుట్టిందే కాఫీతో" అంది దుర్గ.

"నా చిన్నప్పుడు మా నాన్న లక్షాధికారే! నేను నవ రుచులతో శనగపప్పూ, బఠాణీలూ కొనుక్కునేవాణ్ణి! కాలాన్ని బట్టి సాఫీగా రోడ్డున నడిచే వాణ్ణి అడ్డం తిరిగి ముళ్ల డొంకల్లో నడవమన్నారు! నిన్నూ నన్నూ కాదని ఆ పాలవాడు భయంకరంగా పాల ధర పెంచుతానంటే తిండి మానేసి కాఫీ తాగి పడుంటమో - ఏదో ఒకటి నెమ్మదిగా సెటిల్ చేసుకుందాం" అన్నాడు ప్రభాకరం.

"మీరే చెయ్యండి ప్రాయోపవేశం! నా కెప్పుడో తెలుసు, ఎవరి కేం లోపం జరిగినా ఒకర్నొకరు పీకుతారని! అవునూ, ఇంతకీ మీ రా పాల పక్షి పేలిపోతుండటం అంతా వింటూనే హాయిగా మంచం మీద పవళింపు సేవలో ఉన్నారన్న మాట." అన్నది దుర్గ, పొయ్యి మీద పాలను కొరకొర చూస్తూ.

"లేదు. చెవులో మెషిను గన్నులు పేలినట్టయి, పడుకున్న వాణ్ణి పడుకున్నట్టే మూడు నిలువులెత్తెగిరి కింద పడ్డా. లేకుంటే రాత్రి రెండు గంటల దాకా పనిచేసి బుర్ర వేడెక్కిన పక్షి, ఇంకొంచెం వెలుతురొచ్చేదాకన్నా పడుండును" అన్నాడు ప్రభాకరం.

"ఇంకా నయం, ఇంటికప్పంటూ లేకుంటే రాకెట్టల్లే నేరుగా ఆకాశాని కెగిరుందురు! మీరు పడేదే కష్టం గాని ఇవతల పెళ్లాం అంటూ ఒకత్తెను నానారకాల వెధవ లొచ్చి బజార్లో దులిపేస్తుంటే మీకు చీమ కుట్టినట్టు లేకపోవటం ఎంతాశ్చర్యంగా ఉంటుందో! ఇంకో మొగుడయితే ఆ పళ్లెత్తు పాల పక్షి ఒళ్లు హూనం చేసి ఉండును!" అంది దుర్గ, ఫడాఫడా కాఫీ కలుపుతూ.

"ఇంకో పెళ్లాం అయితే పరువుగా పడుండే మొగుణ్ణి ఆ వెధవల మీద ఉసిగొల్పేందుకు బజారు కీడవదు" అన్నాడు ప్రభాకరం.

"అయితే నేను పరువులేని దాన్నన్న మాట! మీ కొంప గుండాన పట్టం ఇష్టం లేని తెలివి తక్కువ బొందను గనక నోరు చేసుకుని బయట పడుతున్నా. రేపట్నుంచి మీరే ఆ అక్కు పక్షులందరితో ఎడాపెడా చెంపలు పగల గొట్టించుకుని ఈ ఇంటి వ్యవహారాలీదండి, నే నో మూల పడుండి నోరెత్తకుండా చూస్తూ కూర్చుంటా! ఆ పచారీ సరుకు షాపుల వాళ్ల కన్న జలగలు నయం! జబ్బులున్న వాళ్లకు జలగల్ని పట్టిస్తే జబ్బులు నయమవుతాయి. ఈ షాపుల వాళ్లు పడితే మనుషుల రక్తం కొళాయి గొట్టాల గుండా దిగిపోయి, పాండు రోగం పట్టి, నీరుడు చూసి చస్తారు! వంద రూపాయల నోటిస్తే జానెడు సంచీకి సరిబడ పొట్లాలు గట్టి పొమ్మంటున్నారు! మొన్న నాలుగు రూపాయలున్న ఆ ముష్టి మాగుడు కంపుగొట్టే నూనెలు ఈ వేళ ఎనిమిది రూపాయలా? పది రూపాయలున్న డాల్డా నెయ్యికి పదహారు రూపాయలా? నూర్రూపాయలున్న ఆ గుండురాళ్ల బియ్యపు బస్తా నూటముప్పయ్యా? మీరు నన్ను లక్ష అన్నా వాళ్లతో నేను కుక్క పోట్లాడినట్టు పోట్లాడైనాసరే, వాళ్ల అంతు తేలవంది వదల్ను!" అంది దుర్గ, కాఫీ ప్రభాకరానికి గిరవాటేసి, కొంచెం పక్కగా ఠపీమని కూర్చుంటూ.

"వదలద్దు ఫలితం ఉంటే. మన ఇళ్లకొచ్చే పాలబాపతు లాంటి వాళ్లే మనకు కొంచెం లోకువ. వాళ్లను ఎన్ని తిట్టినా మనల్ని తిరిగి తిట్టరు. తక్కువ వాళ్లమనే భావం ఇంకా ఎంతో కొంత వాళ్లలో ఉంది. ఏదో ఇంట్లో వాక్కుంటాం గాని, పాపం, ఆ షాపులో వర్తకులంటే వాళ్ల పట్ల మనం బజారు సభ్యత ఒకటి కనబరుస్తాం. నువ్వు పాలవాడితో

మక్కె లిరగ్గొట్టినంత పోట్లాడినట్లుగా ఆ షాపుల్లో పెద్ద మనుషులతో పోట్టాడతావని నేను కల్లో గూడా ఊహించలేను. ఆ షాపులవాళ్ల నడుగుతాం – "అయ్యా, నిన్న రూపాయి సరుకు ఈ వేళ అయిదు రూపాయలైం దేమిటి?" అని. నీకు సమాధానం చెప్పే వ్యవధి పాపం, వాళ్లకు అట్టే ఉండదు గనక నవ్వుతూ టూకీగా నాలుగు ముక్కల్లో చెప్పేస్తారు – "టాక్సులు పెరిగినాయి, పంటలు పండటం లేదు, ఫాక్టరీల్లోనూ, రైల్వేల్లోనూ పనివాళ్ల సమ్మెలు పెరిగిపోతున్నాయి, సరుకే దిగుమతి లేదు" అని. ఒక విధంగా వాళ్ల మాటలూ నిజం కావచ్చు. సరుకు దొరకటమే దుర్లభం అవుతున్నప్పుడు ఈ వ్యాపారులు ఎన్ని కష్టాలొచ్చినా సరే వృత్తి ధర్మం దృష్టితో సరుకు మన కందచెయ్యకపోతే మన బతుకులేం గాను? అందుకే అప్రాచ్యుడెవడైనా 'ఈ వ్యాపారస్తులు మనల్ని నిలువు దోపిడి చేస్తున్నా'రని పిచ్చికేక వేస్తే, వాణ్ని చితగ్గొట్టి జైల్లో కీడ్చేసేందుకు ముందు ఓటు మనం వేస్తాం. బట్టల షాపుల్లో ఫలాని నూలు చీరె ఎంత ఖరీదని నువ్వడిగా వనుకుందాం. వాడు ఏభై రూపాయలని సునాయాసంగా అనేస్తాడు, ముష్టి ఏభై రూపాయలు నీకో లెక్కా అన్న మొహం పెడుతూ. అంతకు ముందు ఆ బాపతు చీరె ధర ముప్ఫై చిల్లరని నీకు తెలుసు. ఆ షాపు వాణ్ణి అదోరకం చూపు చూస్తావు నువ్వు. వాడు నీ చూపు ధోరణి పసిబట్టి నిన్ను వెంట్రుకను చూసినట్లుగా పక్కకు తిరిగి, ఇంకో పది మంది ఆడకూతుళ్లతో వ్యవహారం నడుపుతుంటాడు. నీకు తల తీసేసినంత పనవుతుంది. వాడి కుతిక కొరుకుదా మనిపిస్తుంది. కాని, దర్జా లొలకపోస్తూ హేండ్ బాగుల్లోంచి డబ్బు తీసి గిరవాటేస్తూ, చీరెలు కొనుక్కుపోతున్న పక్క ఆడ జనాన్ని చూసి, నీ నోటికీ చెయ్యికీ పక్షవాతం వస్తుంది. ఇక్కడ పాలవాడి మీద నీ శక్తి కున్న స్వేచ్ఛ అక్కడ తుస్సుమంటుందని నువ్వు గుర్తిస్తావు. అది బజారు సభ్యత!" అన్నాడు ప్రభాకరం, నెమ్మదిగా కాఫీ తాగుతూ.

"అడుక్కుతిన్నట్టుంది మీ చచ్చు ధోరణి! కొంపే తగలబడుతుంటే మీ మొగుళ్లు తగలట్టానికి మూలమేమిటని గణితాలేస్తూ కూర్చుంటే కొంప బుగ్గయి వీధిలో కూర్చుంటాం! మన సంసారం నడక తీరు చూస్తుంటే సంపాదనకు తగ్గట్టుగా సగం బతుకే బతుకుదాం అనటంలో నమ్మకం నా కేనాడో పోయింది. మన పుత్ర రత్నం ఎమ్.ఎస్.సి. చదువుతున్నాడాయెను! వాడి పార్టీలకూ, సినిమాలకూ, పిక్నిక్కులకు, హోటళ్లకూ మనం డబ్బు సర్దకపోతే వాడు మిమ్మల్నీ నన్నూ బజార్న పెట్టేంత విద్య సంపాదించాడు! పిల్ల బి.ఎస్.సి. లో అడుగు పెట్టింది గదా? దాని టాయిలెట్లూ, డ్రెస్సులూ, జాయ్ రైడ్సూ, సినిమాలూ, పిక్నిక్కుల్లో ఏది లోపించినా తనని కాలేజీ నుండి వెలివేస్తారని కాట్ల కుక్కల్లే అరుస్తుంది! మీకు చేతనైతే నాలుగు రాళ్లెక్కువ సంపాదించి, ఈ సంసారాన్నో దారిని పెట్టండి గాని, ఇంకో రకంగా వేగటం నా వల్ల కాదు." ఝూడించినట్టనేసింది దుర్గ, కాఫీ జుర్రున జుర్రుతూ.

"బుర్ర గజిబిజైన మనిషి చెవి దగ్గర జుర్రున జుర్రుతుంటే వాడి స్థితేమౌతుందో ఎలా చెప్పటం! మజ్జిగ అన్నం అయిదు వేళ్లూ లోపలికి పోనిచ్చి, తానులు చించినట్టు జుర్రుకోవటం తగులుతూంటుంది గాని, కాఫీ జుర్రట మేమిటా అని – " అని అంటున్న ప్రభాకరం రెండు తుండేలు చేయబడిన వాడల్లే మధ్యలోనే ఆగిపోయాడు.

రేసు కోర్సులో గుఱ్ఱాలు దౌడు తీసినట్టు కొడుకు శంకరం ఎమ్.ఎస్.సి., కూతురు శాంత బి.ఎస్.సి. ఒకళ్ల ముందొకళ్లు తోసుకుంటూ వచ్చి వంటింటి ద్వారంలో ఇరుక్కు నించున్నారు.

"అమ్మా, నాక్కాఫీ" అరిచాడు శంకరం.

"అమ్మా, నాక్కూడా కాఫీ" అరిచింది శాంత.

"నాన్నా, ఈ డిసెంబర్లో కాలేజీ వాళ్లు మాకు నార్తిండియా టూరు పెట్టారు! నాలుగు రోజుల్లో రెండు వందల ఏభై కట్టాలి! విడిగా వెళితే అయిదు వందలవుతుంది!" అన్నాడు శంకరం ఏకధాటిగా.

"ఈ వెధవకేం పనిలేదు, నాన్నా, డిసెంట్రీ పట్టుకుందని డాక్టరు సర్టిఫికెట్టు ఒకటి పారేస్తే కాలేజీ వాళ్లు నోరెత్తరు. నాన్నా, ఎల్లుండి లోపు టెరం ఫీజు రెండు వందలు కట్టాలి. ఇచ్చేయ్. అమ్మా, నిన్న వాళ్ల జయస్మగుల్డులో డార్కు బ్లూ నైలెక్సు చీరె మార్కెట్టు ధర కన్నా ముప్పై రూపాయలు చౌకగా కొనుక్కుందమ్మా. ఫ్రెష్‌గా ఎంత బాగుందో నేను చెప్పలేను! రెణ్ణెల్ల కిందటే అన్నావు, బ్లూ నైలెక్సు చీరె కొనిపెడతానని" అంది శాంత, శంకరానికి ఖాళీ వదలకుండా.

"లేదు, నాన్నా, టూరు ఎగ్గొడితే మార్కులు తగ్గిస్తారు. సూటూ, టై కూడా వేసుకు రావాలట. నా క్లాసుమేట్లందరికీ సూట్లున్నాయి. అసలీ శాంతకు దర్జా లెక్కువైనాయి, నాన్నా. ఇప్పటికి నాలుగు నైలెక్సు చీరెలున్నాయి దీనికి. కాలేజీ వాళ్లు సినామాస్టార్లల్లే రోజు కో నైలెక్సు చీరె మార్చుకునేం రమ్మనరు" అన్నాడు శంకరం, శాంత కాలు నొక్కుతూ.

"చూడమ్మా, నా కాలెట్టా నొక్కుతున్నాడో! అ చచ్చు సినిమా స్టార్లంటేనే నా కసలు డోకు! నా క్లాసుమేట్సు పుస్తకాల మధ్య సినిమా స్టార్ల బొమ్మలుంటాయి. నా కట్టాంటి వెర్రి వేషాలేం లేవు. ఈ శంకరమే ఆ రాజేష్ ఖన్నా, దేవానంద్ అంటే మూర్ఛపోతాడు, నాన్నా! ఆ చెంపల మీద పిచ్చిక గూళ్లూ, వెనక గిరిజాలూ, వాలిన మీసాలూ, లాల్చీ మీద లతలూ వాడి కదే రామస్మరణ, నాన్నా" అంది శాంత, శంకరాన్ని గిల్లుతూ.

"ఔనౌను. మన దేశమంతటా ఈ భక్తి పుష్కలంగా తాండవిస్తున్నది. భక్తికి ఋజువు భజన. అందుకే మన దేశమంతటా స్టార్ల భజన మందిరాలు వెలిసినాయి.

మన ప్రభుత్వం పెట్టిన చౌక డిపోలు అందులో వెయ్యోవంతు ఉండవు. 'దేశమంటే మనుషులోయ్' అన్నాడు పాపమా అప్పారాయ కవి! ఈవేళాయన బతికుంటే ఆపర్ణ సంతోషిస్తాడు మన మనుషుల్ని చూసి. ఇదిగో, దుర్గా, వీళ్ల సంగతేమిటో నువ్వు కాస్త చూడు. ఆఫీసుకు టైమవుతున్నది, ఇంకా స్నానమే చేయలేదు" తువాలు దులుపుకుంటూ లేచాడు ప్రభాకరం.

"చూసేందు కేముందీ? వాళ్లకి కావలసింది ఇస్తే ఇవ్వండి, లేకుంటే మీ వల్ల కాదని చెప్పండి. పెద్ద చదువులు చదవాలని ఆశలుంటే ఇవన్నీ తప్పుతా యేమిటి?" అంది దుర్గ.

"ఔను మరి, వాడి టూరూ, సూటూ, దాని ఫీజూ, నైలెక్సు చీరే అంతా చేరి స్వల్పంగా అయ్యేది ఆరు వందలేగా! ఆ పాలవాడు ఓ అర్ధ రూపాయి ఎక్కువడిగితే ఇందాకణ్ణుంచి మనం నాలిక పీక్కుని ఛస్తున్నాం! మనకు దయ్యాలు, భూతాలు కనుపించనిది ఏ రోజు?" అన్నాడు ప్రభాకరం, మనసులో భగవాన్ను తలుచుకుంటూ.

"ఇదేం ఖర్మంట! పుట్టిన బిడ్డలకూ, ఆ బజారు పక్షులకూ ముడి పెట్టుకుంటారటండీ ఎవరైనా? మన ప్రయోజకత్వాలు అడుగంటితే దయ్యాలూ భూతాలే కాదు, బ్రహ్మరాక్షసులు కూడా వెంటపడతాయి!" అనేసింది దుర్గ, కాఫీ గ్లాసుల్ని ఖణేల్మని కింద పెడుతూ.

అమాంతం శంకరం, శాంతల మధ్య మార్గం ఛేదించుకుని, బాత్ రూములోకి దూరి తలుపేసుకున్నాడు ప్రభాకరం.

స్కూటరెక్కి ఆఫీసుకు బయలుదేరి, మెయిన్ బజారు పక్క సిగరెట్ బంకు వద్ద ఓ పాకెట్ స్మోకీలకోసం ఆగాడు ప్రభాకరం.

"ఏం ప్రభాకరం, ఆఫీసుకేనా వెళ్లేదీ! నిన్ను కలుసుకోవటానికి కొంచెం ఆలస్యం చేశాను" ప్రభాకరం భుజం మీద చెయ్యి వేసి పలకరించాడు బాల్య స్నేహితుడూ, క్లాసుమేటయిన రామేశం.

"ఏం రామేశం, బాగున్నావా? ఏమిటి విశేషం?" అడిగాడు ప్రభాకరం.

"విశేషం ఉండే నీ దగ్గరికొస్తున్నా, ఇదిగో చూడు, ప్రభాకరం, ఒక పాయింటు వద్ద ప్రారంభమయిన మన జీవితాల్లో నీ జీవితమైనా పచ్చగా ఉందని నేను ముచ్చట పడుతుంటా. రెణ్ణెల్ల నుంచి మా టీచర్లం సమ్మె చేస్తుండటం నీకు తెలియని విషయం కాదనుకుంటా. ఇష్టం లేకపోయినా తప్పలేదు గనక స్నేహ భావంతో నిన్నో వంద రూపాయలప్పడుగుతున్నా. నా దురవస్థకు ఎంతో ఆదుకున్న వాడివవుతావు" అన్నాడు రామేశం, దీనంగా.

"ఇదిగో రామేశం, నువ్వంటే నాకు స్నేహ గౌరవాలున్నాయి. అవసరంగా వచ్చినవాడివి నీతో నీకు కుడిఎడంగా ఉన్న నా స్థితి గురించి వెళ్లబోసుకోవటం నా ఉద్దేశ్యం కాదు. టీచరుగా నీకో రెండు వందలు గిట్టవచ్చు. ప్రత్యేక విలేఖరిగా నాకో అయిదు వందలు ముడతాయి. అయితే ఆర్థిక బాధలకు గురవటంలో నీకు నేనేం తీసిపోనని నువ్వు నమ్మవచ్చు. నాకు జీతం అందిన వారానికే అప్పులు మొదలవుతాయి. కాలేజీ చదువుల ఆదేశాల్ని బట్టి నాలుగు రోజుల్లో నేను నా కొడుకూ కూతుళ్లకు ఆరు వందలు చదివించకపోతే నాకు మరణశిక్ష తప్పదని ఇప్పుడే చెవిని వేసుకుని మామూలుకన్న కొంచెం ముందుగానే ఆఫీసుకు బయలుదేరా. ఈ వేళ ప్రాణాల కన్నా ఏ వస్తువు విలువైనా పెరిగింది. ఆస్తుల్లేని వాళ్లకు చదువుల ఖరీదు ఎక్కువైతే జీవితా లెట్లా గడుస్తాయి, రామేశం? ఏ గడ్డి కరిచయినా సరే నాలుగు రోజుల్లో ఆరు వందలు పుట్టించకపోతే నా గతి కుక్కల్నక్కలు పడవు! రామేశం, నేను నిజం చెబుతున్నానని నువ్వు నమ్ము" అన్నాడు ప్రభాకరం, బంకులో స్మోకీలకు ఖాతా రాసేసి.

"ప్రభాకరం, నువ్వు బతుకుతూ చచ్చినవాడివి? నేను ఎప్పుడో చచ్చి బతుకుతున్న వాణ్ణి! కొంచెం భేదం ఉంది, అంతే" అని వెళ్లిపోయాడు రామేశం.

చేతిలో స్మోకీల పాకెట్ వేపు కొంచెం సేపు చూస్తూ నించున్నాడు ప్రభాకరం.

ప్రభాకరం ఆఫీసులోకి అడుగుపెట్టగానే "బాసు నిన్ను వెంటనే రమ్మని కబురు చేశాడు" అన్నాడు శ్రీరామచంద్ర అనే సంపాదకీయ శాఖోద్యోగి, ప్రభాకరానికి తాఖీదు అందజేస్తూ.

"శ్రీరామచంద్రప్రభో! చల్లని వార్త సాంతం అడుగు పెట్టకుండానే చెవిలో పేల్చేశావు! రక్తపు పోటుండి, వంద మెట్లెక్కి రొప్పుకుంటున్న మనిషి గుండెల మీద ఓ తాపు తన్నితే ఆ దీనుడి స్థితి ఎలా గిలగిల కొట్టుకుంటుందో. నువ్వు ఊహించగలవా, రామచంద్రప్రభో? బాసు పిలుస్తున్నాడంటే మృత్యు కవాటాలు తెరుచుకుని ఆ గదిలోకి పోవటమేనని నీ కెప్పుడైనా తట్టిందా, రామచంద్ర ప్రభో? సరే, 'వెళ్లొస్తా. మనఃపూర్వకంగా నా శుభం కోరు!" అని బాసు గది వేపు నడిచాడు ప్రభాకరం.

బాసు గది ముందు బాయ్ ఉన్నాడు, బొద్దుగా పులి మీసాలతో, ప్రభాకరాన్ని చూడగానే యంత్రంలాగా చెయ్యెత్తి వారించాడు, కాసేపు ఆగమన్నట్టు. 'ఈ చచ్చు వెధవ నన్ను రోజూ కొత్తగా చూస్తాడేం ఖర్మ?" అనుకున్నాడు ప్రభాకరం, మంత్రం తగిలినవాడల్లే నిలబడిపోతూ.

కొంచెంసేపు – ఇంకొంచెంసేపు – చాలాసేపు తను అట్లాగే నించున్నా ననుకున్నాడు ప్రభాకరం.

బాయ్ లోపలి కెళ్లాడు. తిరిగి వచ్చాడు. కొంచెం ఆగాడు. లైను క్లియరైంది లోపలి కెళ్లమని సంజ్ఞ చేశాడు. ఉలిక్కిపడి గదిలోకి నడిచాడు ప్రభాకరం.

గదిలోకి వెళ్లి నించున్నాడు ప్రభాకరం, కొత్తగా నాటక రంగం మీద కాలు పెడుతున్న నటకుడల్లే.

బాసు తల వంచుకుని ఏదో రాసుకుంటున్నాడు. తనను చూశాడా బాసు? ఏమో, ఊహించటం దుర్లభం! అయినా తల వంచుకుని చుట్టూ మూడు వందల డిగ్రీల పరిధిలో ఏం జరుగుతున్నదీ ఇట్టే గ్రహించగల శక్తి బాసు బాబుకుంది! తల ఎత్తడేం? ఘోరమైన సస్పెన్సు! ఎయిర్-కండీషన్డ్ రూము గనక తనకు చెమట పట్టడంలే. బాసు వెనక ఎత్తుగా ఉన్న ఉడెన్ స్క్రీనుకు గాంధీ, నెహ్రూ, ఠాగూర్, రమణ మహర్షి, అరవిందఘోష్, సాయిబాబా, కంచి కామకోటి పీఠాధిపతి బొమ్మలు వేళ్లాడుతున్నాయి. బాసుకు వాళ్ల పట్ల భక్తి గౌరవాలుండవచ్చు. ఆ వ్యక్తులు చెప్పిన తత్త్వాలు కొన్ని రకాలైనవి! ఆ రకాల్లో ఏవి బాగా బాసుకు నచ్చినాయో! నచ్చీ నచ్చకపోయినా బహు జనావళిని బట్టి వాళ్లపట్ల మనం నమ్రతగా ఉండటంలో తప్పేం ఉండదుగా! బాసుకు కవిత్వం గిట్టదే! అక్కడ ఠాగూరు బొమ్మెందుకూ? 'మన కవిత్వాలు వికారంగా ఉంటాయండీ' అని బాసు డోకొచ్చినట్లు ఓసారి అనటం తనకు తెలుసు. మన కవిత్వాలంటే ఆంధ్రులవేగాని విశ్వకవివి కాకపోవచ్చుగా!

"ఏం సుధాకరం, ఏమిటి సంగతి?" చటుక్కున అడిగాడు బాసు, తల ఎత్తకుండానే.

విశాల విశ్వంలో మైమరచి విహరిస్తున్న ఓ వ్యక్తి వీపు మీద చాచి కొడితే ఆ వ్యక్తి ప్రాణం ఏవిధంగా దద్దరిల్లి రెపరెపలాడుతుందో, అంత స్థితి కీచ్చబడ్డ ప్రభాకరం – "నేను ప్రభాకరాన్నండీ" అని తెప్పరిల్లుకుని చెప్పాడు, బాసు పొరబడుతున్నాడని గ్రహిస్తూ.

"అవును, నువ్వు ప్రభాకరానివి కాదనెవరన్నారూ?" అడిగాడు బాసు, తల ఎత్తి ప్రభాకారిన్ని వింతగా చూస్తూ.

"మీరిప్పుడు 'సుధాకరం' అని పలకరిస్తే ఇక్కడ ఇంకెవరూ లేనందువల్ల నా పేరు విషయంలో మీరు పొరబడి ఉండవచ్చు ననుకున్నానండీ" అన్నాడు ప్రభాకరం గుటక మింగుతూ.

"అవును, నీ పేరు ప్రభాకరం అని ఎందుకు మార్చుకోగూడదూ?" ఆ పేరంటే నాకెందుకో చాలా ఇష్టం" అన్నాడు బాసు, ప్రభాకరాన్ని అట్లాగే చూస్తూ.

"అసలు నాపేరు ప్రభాకరమేనండీ" అన్నాడు ప్రభాకరం, దిమ్మెరపోయిన మొహంతో.

"అవునోయ్, నువ్వు ప్రభాకరానివనేగా నే నిందాకట్నుంచీ అంటున్నదీ! కొంపతీసి నువ్వేమైనా పుచ్చుకోలేదు గదా?" అడిగాడు బాసు, ప్రభాకరాన్నదో చూపు చూస్తూ.

"నా కా అలవాటు లేదండీ" అన్నాడు ప్రభాకరం, తెల్లమొహంతో.

"ఉద్ధరించావు! అయినా ఈ వేళ మనుషుల్ని కొలవటం చాలా కష్టం! ఎందుకో అనిపించింది నీ పేరు 'కమలాకరం' అవుతే ఎట్లా ఉంటుందని. 'అధర సుధారసం' అనే మాట నువ్వెప్పుడైనా విన్నావా? అదేమిటో నిన్ను చూసినప్పుడల్లా నా కా మాటే జ్ఞాపకం వస్తూంటుంది. నీ పేరు 'సుధాకరం' అని మార్చుకుంటే బాగుండదూ? వెనక 'వెంకయ్య' అనే నా తోటి విద్యార్థి పేరు భరించలేక మా తెలుగు పండిత రసికుడొకాయన 'వెంకయ్య' పేరు మార్చి 'సుందరమూర్తి' అని పెట్టాడు. అప్పట్నుంచి వెంకయ్యంటే నాకెంతో ప్రేమ పుట్టుకొచ్చింది" అన్నాడు బాసు.

"నాకు కూడా 'సుధాకరం' అనే పేరంటే గిట్టకపోవడం కాదు గానీండి, ఈవేళ నాపేరు మార్చుకుంటే నా ఉద్యోగం పోతుందండీ" అన్నాడు ప్రభాకరం.

"ఛీ, ఎవడా అన్నది! నేనేగా నీ ఉద్యోగం తీస్తే తీసేది?" అన్నాడు బాసు.

"నా ఉద్యోగం 'ప్రభాకరం' పేర ఉందండీ. రేపట్నుంచి నేను 'సుధాకరం' అని సంతకం పెట్టడం మొదలుపెడితే మీ కాషియర్ నాకు జీతం డబ్బు లివ్వకపోగా 'సుధాకరం' అనే పేరు గలవాడికి ఈ ఆఫీసులో ఉద్యోగమే లేదని ఖచ్చితంగా చెప్పేస్తాడండీ" అన్నాడు ప్రభాకరం.

"ఏడ్చాడు వెధవ! అవును 'సుధాకరం' అని పేరు మార్చుకుంటున్నట్టు 'లా' ప్రకారం కట్టుదిట్టాలు చేసుకునే ఏర్పాట్లున్నాయిగా?" ప్రశ్నించాడు బాసు.

"ఉంటే ఉండొచ్చు గానీండి, నాకు బుద్ధి తెలిసినప్పట్నుంచీ నేను ప్రభాకరంగానే పిలవబడుతుండటం వల్ల నా కా పేరు తీసేస్తే నన్ను నేనే గుర్తించకపోవచ్చునే సందేహం ఉందండీ" అన్నాడు ప్రభాకరం.

"అవును, నాకూ నువ్వనుకున్నట్టే అనిపించింది సుమా! నీకు నిజం చెప్పాలంటే ఆ వెంకయ్యకు సుందరమూర్తనే పేరు పెట్టడమే నా కడుపులో దేవినట్టయింది!" అన్నాడు బాసు.

"అవునండీ, ఉంటూన్న పేరు ఇంకో రకంగా ఉంటే అది ఉండనట్టే ఉంటుందండీ" అన్నాడు ప్రభాకరం.

"అవునూ, నువ్విక్కడికెందుకొచ్చా?" చటుక్కున అడిగాడు బాసు, ప్రభాకరాన్ని అప్పుడే చూసినట్టు.

"మీరు కబురు చేశారని ఆఫీసులో చెపితే వచ్చానండీ" అన్నాడు ప్రభాకరం, అసలు బాసును చూస్తూ.

"ఎవరు చెప్పారూ కబురు చేశాననీ." అడిగాడు బాసు.

"శ్రీరామచంద్ర అండీ." చెప్పాడు ప్రభాకరం.

"ఏడ్చాడు! అవును, కబురు చేస్తే చేసి ఉంటా. ఇదిగో, ప్రభాకరం నిన్ను చూడగానే ఒక్కోసారి నీ పేరు జ్ఞాపకం రాక తికమకగా ఉంటుంది. ఎందుకో నీకు తెలుసా." అడిగాడు బాసు.

"తెలుసండి. నేను మీ ఆఫీసులో చేసే పని గుర్తున్నంతగా నా పేరు మీకు గుర్తుండకపోవచ్చు" అన్నాడు ప్రభాకరం.

"కరెక్టుగా చెప్పావు! నీకు తెలివితేటలున్నాయి, ప్రభాకరం. అందుకే నిన్ను ప్రత్యేక విలేఖరిగా వేశానని నీకు తెలుసా?" అడిగాడు బాసు.

"నా మీద మీకు చాలా సదభిప్రాయం ఉందని తెలుసండీ" అన్నాడు ప్రభాకరం.

"ఉంది. కాని, పరిస్థితుల్ని బట్టి అభిప్రాయాలు మారచ్చుగా?" అన్నాడు బాసు.

"మారచ్చు" అన్నాడు ప్రభాకరం, గుటక మింగుతూ.

"మారక తప్పదు కూడా. జయరావు నీకు తెలుసుగా? నీ కన్న అతనికి రెండు వంద లెక్కువిచ్చి ప్రత్యేక విలేఖరిగా ఉద్యోగం ఇవ్వటం కూడా నీకు తెలుసనుకుంటా. అట్లా ఎందుకు చేశానో నీకు తెలుసా?" అడిగాడు బాసు.

"మీరొక సంస్థకు అధిపతులు గనక మీకు కొన్ని సరదాలు ఉండవచ్చనుకున్నా" అన్నాడు ప్రభాకరం.

"నీ కున్న తెలివితోపాటు కొన్ని పాళ్ల తలతిక్కకూడా ఉందనుకోవటం బేసబబేం కాదనుకుంటా. ఇటీవలి నీ రిపోర్టులు అడుక్కుతింటున్నట్టుగా ఉంటున్నాయి" అన్నాడు బాసు.

"ఇంకొంచెం వివరంగా చెబితే అవసరమైన సవరణలు చేసుకుంటా" అన్నాడు ప్రభాకరం.

"నీ హైదరాబాదు రిపోర్టులు నీ సొంత పైత్యం, అక్కర్లేని వాగుడుతో కంపుగా ఉన్నాయి. నా పత్రిక పాలసీ గురంచి నీకెన్ని సార్లు చెప్పినా నీ బుర్ర కెక్కుతున్నట్టు లేదు" అన్నాడు బాసు.

"అందులో నా సొంత పైత్యమేమీ లేదండీ. ఉన్నది ఉన్నట్టు రాసి పంపాను" అన్నాడు ప్రభాకరం.

"ఉన్నది ఉన్నట్టు రాయటంలో పాలసీ ఏడవదే! ఇదిగో, కమలాకరం, నీ బుద్ధి నా పత్రిక కెంతమటుకు పనికి వస్తుందో నే నికేమీ నిర్ణయించుకోలేదు. ఇంక నువ్వు వెళ్లవచ్చు" అని తల వంచుకుని రాసుకోవటం మొదలుపెట్టాడు బాసు.

అడుగులో అడుగేసుకుంటూ సంపాదకీయశాఖ ఆఫీసుకు తిరిగి వచ్చిన ప్రభాకరానికి అక్కడి తోటి ఉద్యోగులందరి కళ్ల చూపులూ తనని బల్లాలతో గుచ్చినట్లు గుచ్చుతున్నట్టూ, తనొక్కడూ వాళ్ల మధ్య ఒంటరిగా దిక్కులేని స్థితిలో నిలబడినట్టూ అనిపించింది. కాని, ఆ పెద్ద మనుషులు ఎవరి పనులు వారు చూసుకుంటూ, నిద్రలో నడిచి వస్తున్నవాడల్లే వస్తున్న ప్రభాకరం తీరు నదో రకంగా చూసినా, ప్రభాకరానికి జరిగిం దేమిటైందీ, అతని మనసు ఈదురుగాలిలో ఓ లేతాకు మాది రేవిధంగా రెపరెప కొట్టుకుంటున్నట్టు కొట్టుకుంటున్నదీ ఊహించగల రనుకోవటం అసంభవం.

అవును మరి, ఇక్కడి తన తోటి ఉద్యోగుల్లో ఎవరైనా బాసు దగ్గర ఘాటుగా డోసు తిని వస్తూంటే తనామిత్రుడి వంక ఏవిధంగా చూసేదీ ప్రభాకరం కూడా ఊహించడలడు!! కొంచెం తెచ్చి పెట్టుకున్న మొహంతో వచ్చి తన టేబిల్ వద్ద కుర్చీలో చేరగిలబడి, బాయ్‌ని పిలిచి, కిందటి సాయంత్రం మెరీనాలో జరిగిన మీటింగు రిపోర్టు ప్రింటింగుకు పంపించేశాడు ప్రభాకరం.

"ఇదిగో, ప్రభాకరం, నువ్వాపంపించే రిపోర్టు, నిన్నటి మెరీనా మీటింగుదైతే నీ రెండో రిపోర్టు అనవసరం. జయరావిచ్చిన అదే రిపోర్టు ఎప్పుడో కంపోజై ప్రింటవుతున్నదికూడా". అక్కడికి మెల్లిగా వచ్చిన శ్రీరామచంద్ర టేబిల్ మీదగా వంగి నెమ్మదిగా ప్రభాకరం చెవిలో చెప్పాడు.

"మరి నేనెందుకా మెరీనాకు కాళ్లీడ్చుకుంటూ వెళ్లా రిపోర్టు తయారు చేసినట్టూ? వెళ్లద్దని నా కెవరూ చెప్పలేదే!" అన్నాడు ప్రభాకరం దిమ్మెరపోతూ.

"ఎవరు చెపుతారోయ్, పిచ్చివాడా! ఇంకో రెండు రోజు లీ రకంగా జరిగినాక నీ అంతట నువ్వే జయరావు నెల్లడుగుతావు, నాసిరకం నీ వాటా వార్తలు ఎక్కడెక్కడి కెళ్లి సంగ్రహించవలసిందీ చెప్పమని" అన్నాడు శ్రీరామచంద్ర.

"ఘోరం! నా కిప్పుడే బాసు చెప్పాడు నా రిపోర్టు తన పేపరు పాలసీ కంటటం లేదనీ, జయరావుకు నా కన్న రెండు వంద లెక్కువిచ్చి పెట్టుకున్నాననీ. నిజంగా బాసుకు ఇవతల వాణ్ణి ముల్లు పెట్టి కెలికే వింత సరదాలున్నాయనే మాట ఆయనతోనే చెప్పొచ్చాను కూడా" అన్నాడు ప్రభాకరం.

"సరదా కాదు, తుక్కు సిద్ధాంతం అను! పేపరు చెలామణి బాగా పెరుగుతున్నది. నీ లాంటి ఇంకో అరడజను మంది అవసరం ఇక్కడే ఆఫీసుకుంది. పేపరు పాలసీ తెలియదనటం పచ్చి దగా! ఉన్న వాళ్లను ఎదగకుండా ఉంచి కొత్తవాళ్లను కొంచెం

మెరుగ్గా చూట్టమనే సిద్ధాంత మొకటుంది – అది చచ్చురకంగా వ్యర్థమని తేలిన విషయమే అనుకో. కాని, కొన్నాళ్లకీ సిద్ధాంతమే జయరావును కుక్కల్లే కరుస్తుందనేది నిజమని నీకిప్పుడే రాసిస్తా" అన్నాడు శ్రీరామచంద్ర, తన చోటికి తను పోతూ.

ప్రభాకరం ఇంటికి చేరేప్పటికి పొద్దు గూకింది. కొంపను వెయ్యి కళ్లతో కనిపెట్టి ఉండే దుర్గ, వీధి తలుపు తెరిచి దొడ్లో వెనక పక్కింటి వారి ఆడకూతురుతో రాచకార్యాలు వెలగ బెడుతుండటం వింతగా తోచింది ప్రభాకరానికి.

లోపలికి వెళ్లి దుస్తులు విప్పి, లుంగీ, బనియను, తువాలుతో వరండాలో కొచ్చి కుర్చీలో కూర్చుని స్మోకీ ముట్టించాడు ప్రభాకరం.

"ఏమండీ, ఆ కూర్చున్నది మీరేనా. పిల్లిలాగా లోపలికొచ్చి గుడ్డలు కూడా మార్చుకున్నారూ? ఇంకా నయం! దొంగవాడొచ్చినా ఇంతేగా! మీ ముద్దుల కూతురు వీధి తలుపు బార్లగా తెరిచి చెప్పకుండా పక్కింటి కెక్కడికో సికారెళ్లింది. చూశారా దాని అడుక్కుతినే దర్జా? దానికేం కొంప గుండానపడితే!! అంది దుర్గ, దొడ్లోంచి వచ్చి వాలుతూ.

"కొంచెం ఘాటుగా కాఫీ ఇస్తావేమిటి?" అడిగాడు ప్రభాకరం.

"కొంచెమేం ఖర్మ, మీరా పాలవాడికి మొక్కుబడున్నంత కాలం ఓ లీటరు తెమ్మన్నా తెస్తా" అంటూ లోపలికి కెళ్లింది దుర్గ.

ఎంత చెడ్డా 'ఇంటివాసన ఇంటి వాసనే" అనుకున్నాడు ప్రభాకరం.

"మీరు నన్ను లక్ష తిట్టినా సరే, మీతోపాటు కూర్చుని కాస్తన్నా కాఫీ తాగంది నాకదో రకం పిచ్చిగా ఉంటుంది" అంటూ రెండు కప్పుల్లో కాఫీ తెచ్చి, పక్క కుర్చీలో కూర్చుంది దుర్గ.

"అంతేగాని, నీకు కాఫీ వాసి ఉందని ఒప్పుకోనంటావు" అన్నాడు ప్రభాకరం.

"ఔనౌను! ఇన్నాళ్ల నుంచీ నేనూ అనుకుంటూంటా, అన్ని గంటలు ఆఫీసులో పనిచేసి వస్తూంటారు గదా ఒకనాడన్నా ఇంటి కొచ్చేటప్పటి కా బుద్ధి మారుతుందేమోనని. అయ్యో రామ, అంత అదృష్టం కూడానా! ఔనండీ, పిల్లలకు కావలసిన డబ్బు విషయం కాస్తన్నా పట్టించుకున్నారా? ఆఫీసులో ఎడ్వాన్సడిగి తీసుకోండి, నెలనెలా కాస్త జీతంలో తగ్గించుకుంటారు" అంది దుర్గ.

"అదెంతసేపు పని! 'ఓయ్, కాసి నో ఆరు వంద లిటు పారెయ్యండి, మెల్లిగా సర్దుబాటు చేసుకుందురు గాని' అని నే ననటమూ, వెంటనే వాళ్లింత నోట్ల కట్ట నా చేతిలో పెట్టడమూ క్షణాల్లో జరిగిపోతుందాయెను! నీ ఉద్దేశ్యం, మా ఆఫీసువాళ్లు మన కేదో వేలు విడిచిన కావలసిన వాళ్లనీ, వాళ్ళు మన కొచ్చే కష్టాల్ని అవతలికి గిరవాటేసి, మనల్ని ఒళ్లో కూర్చోపెట్టుకుని ముద్దు లాడుతూ ఇన్ని చాక్లెటు బిళ్ల లిస్తారనీ నువ్వు

అనుకుంటూ ఉన్నట్టుంది! కాని, వాడుకలో ఉన్న పరిస్థితుల్నిబట్టి అవేం అమల్లో కొచ్చే తేలికైన విషయాలు కావని నేను నీకు గట్టిగా అరిచి చెప్పవలసి ఉంటుంది. ఈవేళ ఆఫీసులో నాకు చందనాది తైలమర్దనతో సుఖంగా తలంటి పోశాడు మా బాసు!" అన్నాడు ప్రభాకరం.

"ఇదేం ఖర్మండీ! ఏమైనా తిట్టాడా. మరి మీ రంటే బాసుకు ఇష్టమేగా! ఎప్పుడూ మీతో సరదాగా మాట్టాడుతుంటాడనే వారు కూడా. ఆయనకి గిట్టని పనేమైనా చేశారా ఏమిటి? చప్పుడు కాకుండా వచ్చి వరండాలో మారు మాట్టాడకుండా కూర్చుంటే ఏదో జరిగుంటుందని అనుమానపడుతూనే ఉన్నా" అంది దుర్గ.

"గిట్టని పనంటే ఆయన చొక్కా పట్టుకు లాగో, భుజం పట్టుకు తోసో చేసుంటాననా నీ ఉద్దేశ్యం? నేను రాసే రిపోర్ట్సు తనకి నచ్చటం లేదనీ, అందుకే రెండు వంద లెక్కువిచ్చి ఇంకోర్ని కొత్తగా పెట్టాననీ నా మొహాన చెప్పాడు బాసు!" అన్నాడు ప్రభాకరం.

"ఎంత అన్యాయం! ఆ మధ్యే గదండీ మీ రంటే మంచి అభిప్రాయం ఉందన్నారు, ఈ వేళేం జబ్బుండీ ఆ మనిషికీ? ఉద్యోగం లోంచి తీసేయడు గదా? అప్పుడు మనం ఏం చేస్తామండీ?" అంది దుర్గ, కుర్చీకి అంటుకుపోతూ.

"తీసివేయడు – వెయ్యలేడు కూడా. కాని, నే నా ఆఫీసులో తలెత్తుకు తిరగలేను. ఆ బతు కెట్టాంటిదో నీకర్థం కాదు" అన్నాడు ప్రభాకరం.

"అర్థం కాకపోతే మునిగి పోయేదేం లేదు లెండి. మీ కా ఇచ్చే అయిదు వందలే మనకు చాలు. గంపెడు మందున్న రెండు కుటుంబాల కా మాత్రమన్నా దక్కక అల్లాట్టం నేను కళ్లారా చూశా. మన ఈ అక్కుపక్షులు టెరిలీన్ డ్రెస్సులనీ, ఫారిన్ నైలెక్సులనీ మిడిసిపట్టం రేపట్నుంచీ తెగ నరక్కపోతే నా పేరు దుర్గ కాదు!" అంది దుర్గ, ప్రభాకరం చేతిలో కాఫీ కప్పు తీసుకుని తన కప్పుతో పాటు కుర్చీ కింద పెడుతూ.

"అసలు మనుషుల తత్వాలకే చీడ పట్టి కుళ్లు కంపు కొడుతున్నది! అది శుద్ధ యేందుకు మనకు కూడా కొంత వాటా ఉంటే బాగుండును" అన్నాడు ప్రభాకరం, స్మోకీ నో గట్టి దమ్ము పీల్చి అవతల గిరవాటేస్తూ.

"అమ్మా, ఏమిటే మీ రిక్కడ చేస్తున్నారూ, వరండాలో లైటన్నా లేకుండా? నాన్నా, శంకరం సినిమా కెళ్లాట్ట. వాళ్ల రాము చెప్పాడు!" అంది శాంత, వరండాలోకి గంతేసి దూకుతూ.

**– ఆంధ్రప్రభ వార పత్రిక; 12.09.1973**